

# మార్గదర్శి

ఓ దశాబ్దం పైనుండి అమెరికాలోనే ఉంటున్నా- ఆంధ్రదేశం వస్తోంటే- ఇంకా ఆనందంగానే ఉంటోంది. వచ్చింది తక్కువసార్లే. ఈసారైతే మరీ- మూడేళ్ళైపోయింది వచ్చి. ఆఫీస్ పనిమీద భారతదేశం వచ్చాను. అది చెల్లీవాళ్ళతో ఓ రెండు రోజులు కలిసుండడానికి అవకాశం వచ్చింది. అలానే కొందరు స్నేహితుల్ని కలవడానికి కూడా.

అంతకన్న ముఖ్యంగా-

కొన్నిరోజులుగా నాలో రగులుతున్న ఓ అంతర్మథనానికి ఇక్కడ సమాధానం దొరుకుతుందని నా ఆశ. ఉత్తి ఆశే కాదు- నమ్మకం కూడా. అమెరికాకి వెళ్ళడానికి ముందుకూడా ఇలాంటి అంతర్మథనానికి- ఇక్కడే- చాలా వింతగా- సమాధానం దొరికింది.

హైదరాబాద్ విమానాశ్రయం బాగా మారిపోయింది. భారతదేశంలో విమానాశ్రయంలా అనిపించలేదు.

నిజానికి విమానాశ్రయం మారిపోవడం కాదు. విమానాశ్రయం చోటే మారిపోయింది.

అది ఊరికి దూరంగా జరిగిపోయింది.

రోడ్లూ, బిల్డింగులూ- అన్నీ మారిపోయాయి. ఎంత బావుందో. నేను అమెరికాకి వెళ్ళడానికి ముందే ఈ మార్పు వచ్చుంటే- నేనసలు వెళ్ళేవాడినో లేదో.

ఆ రోజుల్లో మంచి చదువులకీ, ఉద్యోగాలకీ- అమెరికా ఒక్కటే గమ్యం. ఇప్పుడూ అంతే- ఐతే అప్పుడంత కాదు. ఇంకో రెండు మూడూ దశాబ్దాల్లో పరిస్థితి ఇంకా మారిపోతుందంటున్నారు. ఇంకొన్ని ఏళ్ళ తర్వాత ఇండియా చైనాలు ప్రపంచ అగ్రరాజ్యాలౌతాయి అని అంటున్నారు. ఆ మాటలు నిజం అవుతాయో లేదోకానీ వినడానికి మాత్రం ఆనందంగా ఉంటాయి.


**అనామకుడు**

హైదరాబాద్ చూస్తోంటే- ఆ మాటలు నిజం అవుతాయేమో అని అనిపించింది. సాయంత్రం ఆరింటికి మా పెద్దనాన్నగారబ్బాయి- రావ్ ఇంటికి వెళ్ళాను.

రావ్‌కుటుంబం నాకోసం ఎదురుచూస్తోంది.ప్రపంచీకరణ ప్రతీకల్లా ఉన్నాయి- పిల్లల వేషభాషలు. ప్రపంచం అంతా సుమారుగా ఎలాంటి అలంకరణ చేసుకుంటున్నారో- అలానే చేసుకున్నారు- ప్రాంతీయ ఆహార్యం అంతరించిపోతుందేమో అనిపించేట్లు.

వాళ్ళలో వాళ్ళే కాకుండా- వాళ్ళమ్మా నాన్నలతోనూ, నాతోనూ-ఇంగ్లీష్‌లోనే మాట్లాడసాగారు-ఇంకే భాషలూ మిగలవేమో అనిపించేట్లు.కొంతసేపు కబుర్లయ్యాక- డిన్నర్‌కి బయటకి బయల్దేరతీశారు.

చాలా కాలం తర్వాత- తెలుగు నాట- ఓ తెలుగు ఇంట- తెలుగు భోజనం తిందామన్న కోరిక తీరడం లేదనుకుంటూ బయల్దేరాను. ఓ ఐదు నక్షత్రాలహోటల్లో- రిజర్వ్ చేయించిన టేబుల్ ముందు కూచున్నాక- రావ్ పిల్లల్ని-"అంకుల్‌కి ఏం తినిపిస్తారు?"అని అడిగాడు.



వాళ్ళలో వాళ్ళు- థాయ్, మెక్సికన్, చైనీస్, ఇటాలియన్- అంటూ మాట్లాడేసుకుని- ఆర్డర్ చేసేశారు.

కబుర్లు చెప్పుకుంటూ తిన్నాం. ఐదునక్షత్రాల హోటల్ తిండి బావుంది. ఐతే నేను వెతుకుతున్నది వేరు.అది నాకు దొరకలేదు."ట్యాంక్‌బండ్‌కి వెళ్దామా?" అన్నాను భోంచేసి బయటకి వస్తూ.

"నువ్వు హైదరాబాద్ వచ్చి చాలా రోజులైంది. అందుకే ఇంకా ట్యాంక్ బండ్ అంటున్నావ్.

ఐమేక్స్‌లాంటివి వచ్చాయని కూడా నీకు తెలియదు కదా. చాలాబావుంది. అక్కడ సినిమాకి టిక్కెట్స్ బుక్ చేయించాను" అంటూ కారెక్కాడు రావ్.

చాలారోజుల తర్వాత ఓ తెలుగు సినిమా చూడ్డం అవుతుందనుకున్న నాకు అక్కడా నిరాశే ఎదురైంది. అది ఓ ఇంగ్లీష్ సినిమా. తెలుగు సినిమాలు బోరని ఒక్కసారిగా నలుగురూ అనేశారు.

దొరికింది బాలేదని కాదు కానీ- నాక్కావాల్సింది నాకు దొరకలేదు. ఇంకా మూడు రోజులుందిగా అని అనుకుంటూ నిద్రపోయాను.

మర్నాడు చిన్ననాటి స్నేహితుడు- రెడ్డితో బయటకి తిరగడానికి బయల్దేరాను.చార్మినార్ వైపో, పబ్లిక్ గార్డెన్స్ వైపో వెళ్దాం అని నేనంటే- "అసలక్కడ చూడ్డానికి ఏముంది- హైదరాబాద్ అంతా ఇటు ఉంది" అంటూ హైటెక్ సిటీవైపు తీసుకెళ్ళాడు.

వాడు చెప్పిందీ నిజమే. నగరం స్వరూపాన్నే మార్చేసింది ఈ సైబరాబాద్. ఇరుకు గల్లీలలో, పాత ఇళ్ళతో, అనాగరికంగా కనిపించే ఊరు-

వెడల్పాటి రోడ్లతో, పెద్ద పెద్ద బిల్డింగులతో మెరిసిపోతూ కనిపిస్తోంది. అది పై మార్పు. అంతకు మించి- మంచి ఉద్యోగాలకీ, చదువులకీ, హాస్పిటళ్ళకీ ఆలవాలమైంది. మాయాబజార్ సినిమాలోలా ఏమీలేనిచోట అందమైన ప్రపంచం సృష్టించబడింది.

ఐతే అది నాకు కొత్త కాదు. దాన్ని నేను అమెరికాలో అన్నిచోట్లా చూస్తూనే ఉంటాను. నేను వెతకబోయిన తీగ అది కాదు. తీగ దొరకడం లేదు. దొరకడానికి అక్కడ ఎవ్వరూ రోడ్ మీద ఏ తినుబండారాలూ అమ్ముతూ కనిపించడం లేదు.

అదే మాట అన్నాను రెడ్డితో. వాడు నావైపు చిత్రంగా చూసి భళ్ళున నవ్వేశాడు."ఏ కాలంలో ఉన్నావ్ నువ్వు? ఇక్కడ పనిచేస్తున్న వాళ్ళెవ్వరూ రోడ్డు మీద వడలో, బటానీలో కొనుక్కుతినరు" అని అన్నాడు.

"పల్లీలో" అన్నాను నేను ఆశగా.

"ఇక్కడ అవి అమ్మేవాళ్ళూ లేరు- తినేవాళ్ళూ లేరు. అంతా బర్గర్లూ, సేండ్విచ్చుల వాళ్ళే"

భారతదేశం వెలిగిపోతోంది అని కొన్నాళ్ళ క్రితం వినిపించిన నినాదం-నాకు ప్రత్యక్షంగా కనిపించింది.

మంచి మంచి ఉద్యోగాలూ, జీతాలూ, జీవన శైలులూ- అంతా మారిపోతోంది.

అదే మాట అన్నాను రెడ్డితో. "మారుతోంది. ఇంకా మారాలి. అంతకుముందు మధ్యతరగతివర్గం వాళ్ళెవ్వరూ అనుభవించనివి- ఇప్పటి మధ్యతరగతి వర్గం అనుభవిస్తోంది. ఎంత మంచి ఫ్లాట్లొస్తున్నాయో. ఎన్ని రకాల కార్లు అందుబాటులోకి వచ్చాయో.

● ప్రతినిముషాన్ని వ్యర్థంచేయక వినియోగించుకో. లేకుంటే నీవు వృథా చేసిన కాలం భవిష్యత్‌లో నీ అదృష్టాన్ని తారుమారు చేస్తుంది.

ఈ మధ్య ప్రపంచ ఆర్థిక మాంద్యం దృష్ట్యా కొంచెం తగ్గినట్లనిపిస్తోంది కానీ- కాస్త చదువుకుంటే చాలు- ఉద్యోగం కోసం వెతుక్కునే అవసరం రాకుండా అయిపోతోంది'' వివరంగా చెప్పాడు.

అమెరికాలో మొదలైన ఆర్థిక సంక్షోభపు సునామీ అల- ఆ దేశాన్ని ముంచి- యూరప్ మీదుగా క్రమ క్రమంగా ఆసియా కూడా చేరుకుంటోంది.

ఇక్కడ దాని ప్రభావం తక్కువగా ఉన్నట్లు కనపడుతున్నా- ఇండియా లాంటి దేశాలు కాస్తైనా మునుగుతాయి. ఆ ముంపు ఎంతో, ఎప్పటికి తీరుతుందో తెలియదు. ఇప్పటికింకా ఎక్కువ మునిగినట్లు లేదు.

"ఈ ఎదుగుదలా-ఈ పెరుగుదలా- అంతా కాస్తో కూస్తో చదువుకున్న వాళ్ళకేనా-అందరికీనా?'' నా మనస్సులో ఉన్న సందేహాన్ని సంశయిస్తూనే అడిగాను.

"రెండురకాల వాదాలూ ఉన్నాయి. ఈ పెరుగుదల అంతా కొందరికే లాభం చేస్తోందనీ- దేశంలో చాలా మంది ప్రజలకి దాని లాభాలు అందకపోవడమేకాకుండా నష్టం కూడా కలుగుతోందనీ-అనే వాళ్ళూ ఉన్నారు.

దేశం ఆర్థిక పరిస్థితి ఇలా పెరుగుకుంటూపోతే- దాని లాభాలు అందరికీ ఏదో ఒకరోజు తప్పకుండా అందుతాయని అనేవాళ్ళూ ఉన్నారు.

ఇద్దరు ఆర్థికశాస్త్రవేత్తలు ఉంటే మూడు అభిప్రాయాలంటారు'' అన్నాడు వాడు నవ్వుతూ.

"అలా లబ్ధి పొందలేని వాళ్లకి- మనలాంటి వాళ్ళం- ఏదన్నా చెయ్యగలుగుతామా-'' అని నేను చెప్తున్న మాటలు ఇంకా పూర్తికాకముందే-

"మనలాంటి వాళ్ళం కాదు- నీలాంటి వాళ్ళు- డాలర్లు సంపాదించే వాళ్ళు-'' అన్నాడు రెడ్డి.

నేనింకేం మాట్లాడలేదు. నా మనస్సు మాత్రం నేను వెతుక్కునేది దొరకడంలేదే అని మూలుగుతూనే ఉంది. పల్లీలు అమ్ముకునే వాడు ఒక్కడంటే ఒకడు కూడా నేను తిరిగిన ఏ ఒక్క రోడ్ మీదా కనపడకపోవడం- నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

రాత్రికి విజయవాడ వెళ్ళాను. చెల్లి ఆనందంగా ఎదురొచ్చింది. పిల్లాడు- రెండున్నర ఏళ్ళ వాడు- నన్ను చూసి వాళ్ళమ్మ కొంగుచాటున దూరిపోతోంటే-

"కంప్యూటర్ అంకుల్రా- వీడియో ఫోన్‌లో మాట్లాడతాం కదా- అమెరికాలో అంకుల్తో'' అంది.

కంప్యూటర్లూ- ఇంటర్నెట్లూ- మనుషుల్ని దూరం చేసేస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది. కానీ అవే లేకపోతే నా మేనల్లుణ్ణి నేనూ-నన్ను వాడూ- ఒకర్నొకరం చూసుకుని మాట్లాడుకోగలిగే వాళ్ళమే కాదు.

చెల్లి పరిచయం చేశాక వాడికి నేను గుర్తుతెలిసినట్లున్నాను- నన్నింక వదల్లేదు వాడు, నా వెనుక తిరుగుతూ "అంకుల్- అంకుల్'' అంటూ.

విజయవాడలో తెలుగు భోజనమే దొరుకుతుందనుకున్న నాకు నిరాశే మిగిలింది. బావగారు వస్తూ వస్తూ- ఓ పెద్ద పిజ్జా తెచ్చారు. అమెరికా నుండి వచ్చిన నాకు ఆయన చేసిన మర్యాదని తిరస్కరించలేకపోయాను. అంతే కాదు. పిల్లాడికి అది చాలా ఇష్టమట.

మర్నాడు బావగారు ఆఫీస్‌కీ, పిల్లాడు ప్రీస్కూల్‌కీ వెళ్ళిపోగానే- మెల్లగా చెల్లిదగ్గరచేరి మొహమాటపడుతూనే నా కోరిక వెళ్ళబెట్టాను.

"నీకు ఇదేం కోరికరా బాబూ- వేరుశెనక్కాయలు కొనుక్కు తినాలని-నీకోసం స్పెషల్గా కేకులూ- కోకులూ తెప్పిస్తానుండు'' అంది తన ధోరణిలో.

"అది కాదే- నాకేంటో- దుర్గగుడి దగ్గరో- బ్యారేజ్ దగ్గరో- ఏ పార్కుదగ్గరో- ఓ బుట్టలో ఇన్ని వేరుశెనక్కాయలు పోసుకుని- దానిమీద ఓ బొగ్గులముంత పెట్టుకుని- ఏ కుర్రాడో అమ్ముతోంటే- వాటిని కొనుక్కుని తినాలనుంది'' అన్నాను.

అది నా గుండె లోతుల్లోంచి వచ్చిన నిజం. ఐతే అదొక్కటే నిజం కాదు. అంతకన్న ముఖ్యమైంది ఇంకోటి ఉంది. అది నేను చెప్పలేదు. చెప్తే ఎవరైనా నవ్వుతారు. ఆఖరికి నా చెల్లి కూడా.

"అలాంటి చోట్లకేం వెళ్తాం కానీ- బావగారు నీకు బట్టలు కొనమన్నారు. షాపింగ్‌కి వెళ్దాం'' అంది.

"నేను కూడా మీకు బట్టలు కొంటా-పద-అక్కడెక్కడైనా వేరుశెనక్కాయల పొట్లాలు అమ్మేవాళ్ళుంటారా?'' ఆశగా తనని అడిగాను.

● మనిషికి మంచి మనసుండాలేగానీ, సంపదలు వాటంతటవే వస్తుంటాయి.

## పద్ధతిగా ఉంటే...



ఓ పద్ధతిగా వ్యవహరించే వారి తీరు, జోరు చూస్తుంటే ఒక్కోసారి బోరనిపిస్తుంది. కాని పద్ధతి ప్రకారం సాగేవారు ఎక్కువకాలం జీవిస్తారు.

లక్ష్యాలు ఎక్కువగా ఉండి, ప్రతి పనిని క్రమపద్ధతిలో సాగిస్తూ, అన్ని అంశాలపట్ల కాన్షస్‌గా ఉండేవారు దీర్ఘ కాలం జీవిస్తారని అంతర్జాతీయ బృందం జరిపిన పరిశోధనల్లో తేలింది. ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో వైద్యపరమైన, సామాజిక అంశాలు ఏవిధంగా కీలకమో మానసిక స్థితిగతులూ అంతేముఖ్యం.

క్రమబద్ధంగా, లక్ష్యపూరితంగా నడిచేవారు నాలుగేళ్ళు ఎక్కువగా జీవిస్తారు. ఇటువంటివారు స్థిరంగా, అంతగా ఒత్తిడి లేని ఆలోచనలతో ఉంటారు. అదే వారి ఆరోగ్య రహస్యం. ◆

"నీ అదృష్టం బావుంటే నీక్కావల్సింది నీకు దొరకవచ్చు" అంది బయల్దేరుతూ.

దొరికితే నిజంగా నా అదృష్టమే అని అనుకుంటూ నేనూ తనతోపాటు బయల్దేరాను.

ఊళ్ళో నాలుగైదు చోట్లకి వెళ్ళాం. షాపులో చెల్లి బట్టల పరీక్ష చేస్తోంటే- నేను షాపు బయట అమ్మేవాళ్ళని చూస్తున్నాను. నా చిన్నప్పుడు ఎక్కడపడితే అక్కడ కనిపించే వేరుశెనక్కాయల కుర్రాళ్ళు ఇప్పుడు అసలు కనిపించకపోవడం ఆశ్చర్యంగా అనిపించింది.

అలాంటివి తినేవాళ్ళు కూడా తగ్గిపోతోంటే-వాటిని అమ్ముకు బతికేవాళ్ళు ఉండడం లేదా? అలా కాక-రకరకాల మంచిఉద్యోగాలు వచ్చి అలాంటివి అమ్ముకు బతకాల్సిన అవసరమే లేకపోతోందా?

సమాధానం దొరకడంలేదు.దానికి సమాధానం నేను తీసుకోవల్సిన ఒక నిర్ణయానికి చాలా అవసరం.

పదేళ్ళక్రితం ఇలాంటిదే ఒక నిర్ణయం తీసుకోవల్సి వచ్చింది. బీ.టెక్ తర్వాత పైచదువులకి అమెరికా వెళ్ళాలా వద్దా అన్న ఆలోచన నన్ను దొలిచేస్తోంటే-

ఏం చెయ్యాలి అన్నదానికి సమాధానం దొరికినట్లే- ఇప్పుడూ దొరుకుతుందన్న ఆశే- నన్ను నాకు కావల్సిన దాని కోసం వెతికిస్తోంది.

అప్పటి సంధ్యా సమస్య- పై చదువులకి అమెరికా వెళ్ళడమా మానడమా అని. అప్పుడు తీసుకున్న నిర్ణయం మాత్రం మంచిదే అయింది.

పెద్ద చదువూ, గొప్ప సంస్థలో ఉద్యోగం, మంచి జీతం- అమ్మానాన్నల ఆర్థిక సమస్యలు తీర్చగలిగాను. చెల్లికి మంచి సంబంధం చెయ్యగలిగాను.

ఆ విధంగా నేను చదువుకున్న చదువుకి సార్థకత సంపాదించుకోగలిగాను.

ఇప్పటి సమస్య-అమెరికా నుండి భారతదేశం వచ్చెయ్యడమా అని. ఇక్కడకి వచ్చి- ఇన్నాళ్ళూ నేను సంపాదించుకున్న డబ్బుతో- ఇక్కడ ఆ డబ్బు అవసరం ఉన్నవాళ్ళకి ఏదన్నా చేద్దామా అని.

ఇలాంటి సమస్యలు ఎంత ఆలోచించినా తెగవు. ఎవరిని అడిగినా- వారి వారి అనుభవాల్లోంచి సలహాలు ఇస్తారు.అవి నాకు సరైనవి అవుతాయో లేదో తెలియదు. మార్గం నిర్దేశిస్తున్నవాడు- మార్గాన్ని సూచించాలి. అందుకు అప్పుడు ఒక మార్గదర్శి దొరికింది. ఆ సంగ

**●చక్కని ఆలోచన, సరైన ముందుచూపు లేనివారికి జీవితంలో అడుగడుగునా ఆపదలు ఎదురవుతుంటాయి.**

తేంటో ఇప్పుడు తప్పకుండా చూడాలి.

ఆ రాత్రే తిరుగుప్రయాణం.

చెల్లి నా బాధని అర్థం చేసుకుంది. సాయంత్రం ఇద్దరం కలిసి బయల్దేరాం. ఓ పార్కు బయట ఓ వేరు శెనక్కాయల కుర్రాడు కనిపించాడు.

వాడి దగ్గర రెండు వేరుశెనక్కాయల పొట్లాలు కొనుక్కుని లోపలికి వెళ్ళాం.

"నీ కోరిక తీరిందా? కాయలు బావున్నాయా?" అని అడిగింది చెల్లి, శెనక్కాయల్ని నోట్లోవేసుకుంటూ.

నాకు కాయలకన్న- ఆ కాయల్ని కట్టిన కాగితం ముఖ్యం. అది నా మార్గదర్శి.

దొరక్క దొరక్క దొరికింది. తొందర తొందరగా కాయలు ఓ పక్కన పడేశాను.

"అదేంట్రా- వేరుశెనక్కాయలకోసం ఇంతసేపూ ప్రాణంతీసేసి- ఇప్పుడు" అని చెల్లి అంటున్నా వినకుండా కాగితం విప్పేసి అటూ ఇటూ చూశాను.

అది ఖాళీ కాగితం. అందులో ఏమీ రాసి లేదు. ఆ ఖాళీ కాగితాన్ని చూడ్డంతో నా మనస్సు ఖాళీ అయిపోయింది. ఆ తెల్లకాగితంలా నా మొహం కూడ పాలిపోయిందేమో- చెల్లి కంగారుగా-

"అదేంట్రా అలా అయిపోతున్నావ్" అంటూ నన్ను పట్టుకుంది. నా బాధని నేను మనస్సులో దాచుకోలేక పోయాను. చెల్లికి విషయం చెప్పేశాను.

"పదేళ్ళ క్రితం నేను బీ.టెక్ తర్వాత ఇండియాలోనే ఉండిపోవాలా- అమెరికా వెళ్ళాలా అన్న సందిగ్ధంలో పడ్డాను. మర్నాడు నిర్ణయం తీసుకుని తీరాలి. ముందు రోజు నేను తిన్న వేరుశెనక్కాయల పొట్లంలో-

ఓ కొటేషన్ కనిపించింది. అది నాకు స్పష్టమైన సందేశాన్నిచ్చింది. ఓ నిర్దిష్టమైన మార్గాన్ని చూపించింది. అదే నన్ను అమెరికా వెళ్ళేలా చేసింది.

నా జీవితాన్ని ఆనందమయం చేసింది.

ఇప్పుడు నేను మళ్ళీ అలాంటి సందిగ్ధంలో ఉన్నాను. అమెరికా వదిలేసి మళ్ళీ భారతదేశం వచ్చెయ్యాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నాను నేను.

నేను సంపాదించిన దాంతో ఇక్కడ నేనేదన్నాచెయ్యగలనా లేనా అన్నదే ఆలోచన.

నాకు మళ్ళీ అలాంటి కాగితంలో ఓ కొటేషన్ దొరుకుతుందనీ-అదే నా గమ్యాన్ని నిర్దేశిస్తుందని అనిపించింది. దాని కోసం నాలుగు రోజులుగా తిరుగుతున్నాను. ఈ రోజుకి కాగితం దొరికింది. అందులో ఏదో రాసి ఉంటుందనుకున్నాను. ఐతే అది ఖాళీ కాగితం. నాకు మార్గదర్శి దొరకలేదు"

ఎవరితోనన్నా ఈ విషయం చెప్తే నవ్వుతారు. అది నాకు తెలుసు. అందుకే చెల్లితో ఇంతవరకూ ఈ విషయం చెప్పలేదు. ఐతే అంతా విని చెల్లి నవ్వలేదు. నవ్వకపోగా నన్ను అనునయిస్తూ-

"నువ్వు చిన్నప్పట్నుండీ ఇంతే. నీకు పరీక్షలు బాగా రాసే తెలివితేటలు బానే ఉన్నాయి కానీ జీవితాన్ని అర్థం చేసుకునే తెలివితేటలు కొంచెం తక్కువ- ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు"అంటూ ఆగింది.

నేనేం అంటానో అన్నట్లు. నేనేం మాట్లాడలేదు. చెల్లి ఏం చెప్తుందా అన్నట్లు తన్నే చూస్తూ కూచున్నాను.

"పదేళ్ళక్రితం నువ్వు అమెరికా వెళ్దామనుకున్నావ్.

అది నీ స్వంత ఆలోచన.ఆ పరిస్థితుల్లో అది సరైన ఆలోచన కూడా. అప్పుడు నీకు దొరికిన వేరుశెనక్కాయల పొట్లం కాగితంలో కొటేషన్ ఏదో నీ ఆలోచనకి బలాన్నిచ్చి ప్రోత్సహించింది.

అంతే కానీ అదే మార్గదర్శి కాలేదు.ఎవరికైనా మార్గదర్శి ఎక్కడో కాగితంలో ఉండదు. వాళ్ళలోనే ఉంటుంది. నీకు ఇదిగో ఇక్కడ ఉంటుంది. అది చెప్పేది విను. నీ మార్గం నీకే తెలుస్తుంది.

ఏం చెయ్యాలో నీకే అర్థం అవుతుంది" అంది నా గుండెమీద ఆత్మీయతగా చెయ్యి వేస్తూ.

చెల్లి ఆత్మీయమైన స్పర్శకి- నా గుండె ద్రవించింది. కళ్ళు చెమర్చాయి. గొంతు పూడుకుపోయింది.

నా బంగారు చెల్లి చెయ్యి తాకడం వల్లనేమో- నా గుండె సవ్వడి నాకు వినిపించసాగింది. కళ్ళు మూసుకుని, నెమ్మదిగా వినసాగాను.

చెల్లి గుండెలోని మాటల్ని- నాకు నా గుండె చెప్తున్నట్లు అనిపించింది. అవి వింటూ ఉండిపోయాను.

అలానే- ఉండిపోయాను. ◇◇

**●తనను కన్నవారిమీద కన్నా, తాను కన్నవారిమీద ప్రేమ ఎక్కువగా ఉంటుంది.**